బీమా క్రెడిట్ కార్డును వినియోగించుకోండి

- తుఫాన్‌లో నష్టపోయిన 40 మంది రైతులకు రూ.19 లక్షలు మంజూరు
- పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు సీహెచ్.నరసింహులు

· 8లో

నిర్లక్ష్యాన్ని ఉపేక్షించను

- అధికారులకు కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ హెచ్చరిక
- 'మీ కోసం' కార్యక్రమంలో 89 వినతుల స్వీకరణ



'మీ కోసం'లో ప్రజల సమస్యలను వింటున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, తదితరులు

పాడేరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో ప్రజలు ఇచ్చే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అధికారులను హెచ్చరించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక వెబ్‌సైట్‌ను పరిశీలించి అధికారులు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. తమ సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారనే విశ్వాసాన్ని ప్రజల్లో ఏర్పరచాలన్నారు. అందులో భాగంగా ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం సంబంధిత వెబ్‌సైట్‌ను అధికారులు స్వయంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు.

మీ కోసం కార్యక్రమంలో 89 వినతులు

ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'మీకోసం' ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 89 వినతులను అధికారులు స్వీకరించారు. డుంబ్రిగుడ మండలం పోతంగి సర్పంచ్ వంతల వెంకటరావు చాపరాయి, కోసంగి, చెంపపట్టి గెడ్డలపై వంతెనల నిర్మాణాలు చేపట్టాలని కోరగా, పాడేరు మండలం లగిశపల్లి గ్రామస్థులు అడపా కాంతమ్మ, మసాడ బాలమ్మి, ఎం.నాగరాజు తదితరులు కాఫీ బోర్డు నుంచి సిమెంటు కల్లాలు మంజూరుకు పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరారు. అలాగే జి.మాడుగుల మండలం పెదలువ్వాసింగి ఎంపీటీసీ సభ్యుడు గబ్బడి సన్యాసిదొర, బొండపల్లి గ్రామం నుంచి అలగల గ్రామానికి తారురోడ్డు నిర్మించాలని కోరగా.. ఇదే మండలం పాలమామిడి సర్పంచ్ సురభంగి రామకృష్ణ, వల్లంగుల గ్రామానికి రహదారి, గెడ్డపై కల్వర్టు నిర్మించాలని కోరారు. అలాగే హుకుంపేట మండలం బూర్జ నుంచి ... మిగతా 8వ పేజీలో

రైతులు, ప్రజలను ఆదుకోండి

బ్యాంకర్లతో కలెక్టర్ దినేశ్‌కుమార్



కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో కలెక్టర్ దినేశ్‌కుమార్ సమావేశం

పాడేరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వరదల్లో తీవ్రంగా నష్టపోయిన రైతులు, ప్రజలకు బ్యాంకర్లు తమ వంతు చేయూత అందించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో నిర్వహించిన జిల్లా ప్రత్యేక సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వరుసగా వస్తున్న వరదలు, వానలకు జిల్లా ప్రజలకు, రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు బ్యాంకర్లు రుణాలు అందించాలని, పాత రుణాలు రీషెడ్యూలు చేయాలన్నారు. వరదలకు 320 గృహాలకు నష్టం వాటిల్లిందని, ఆయా గృహాలకు రూ.1.19 లక్షలు నష్టపరిహారం అందిస్తామన్నారు. అలాగే 2,398 హెక్టార్లలో రూ.3.29 కోట్ల విలువైన పంటలు నీట మునిగాయన్నారు. ఈ తరుణంలో రైతులు, ప్రజలకు మేలు జరిగేలా బ్యాంకర్లు తమవంతు సహకారాన్ని అందించి ఆదుకోవాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు వి.అభిషేక్, కె.సింహాచలం, యూబీఐ రీజనల్ మేనేజర్ పి.నరేష్, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ అభిషేక్, గ్రామీణా వికాస బ్యాంకు రీజనల్ మేనేజర్ శరత్‌చంద్ర, డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు వర్చువల్‌గా పాల్గొనగా, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎం.ఎం.నాయుడు, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, నాబార్డు డీడీఎం రావూరి చక్రధర్ పాల్గొన్నారు.

రేషన్ కోసం..

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు దాటుతున్న గిరిజనులు



నిత్యావసర సరకుల కోసం వాగు దాటుతున్న గొల్లపల్లి గిరిజనులు

సీలేరు, సెప్టెంబరు 13: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మారుమూల గ్రామాలకు వెళ్లే రహదారుల్లో వంతెనలు లేకపోవడంతో గిరిజనులు నిత్యావసర సరకుల కోసం ప్రాణాలను పణంగా పెట్టి వాగులను దాటుతున్నారు. జీకేవీధి మండలం ఏ.దారకొండ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి, పెబ్బంపల్లి, తడకపల్లి గ్రామాల గిరిజనులు నిత్యావసర సరకులు కావాలన్నా.. అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లాలన్నా.. రెండు వాగులు దాటి వెళ్లాలి. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ రెండు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ మూడు గ్రామాల గిరిజనులు గురువారం ప్రాణాలను లెక్క చేయకుండా వాగును దాటుకుంటూ సరుకులను తీసుకువచ్చారు. ఈ వాగులపై వంతెనలు నిర్మించి తమను ఆదుకోవాలని పాలకులు, అధికారులను గొల్లపల్లి, పెబ్బంపల్లి, తడపకపల్లి గ్రామాల గిరిజనులు వేడుకుంటున్నారు.

తహసీల్దార్ల బదిలీలపై తర్జనభర్జన

- నగరం/మైదానం నుంచి ఏజెన్సీకి వెళ్లబోమంటున్న జూనియర్లు
- నేతల ద్వారా సిఫారసులు
- మరోవైపు పాడేరు డివిజన్ నుంచి ఏడుగురిని మైదాన ప్రాంతానికి పంపేందుకు అల్లూరి జిల్లా అధికారులు సుముఖం
- ఐటీడీఏ నిబంధనలు అమలుచేయాలని కోరుతున్న ఏజెన్సీ తహసీల్దార్లు
- ఇటు నుంచి ముగ్గురినే పంపుతారని ప్రచారం
- త్వరలో మూడు జిల్లాల కలెక్టర్ల భేటీ



విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో జూనియర్లు అయిన తహసీల్దార్లు కొందరు నగరం, మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి వెళ్లేందుకు ససేమిరా అంటున్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పనిచేస్తాం తప్ప ఏజెన్సీ మండలాలకు వెళ్లలేమని తెగేసి చెబుతున్నారు. అదే సమయంలో ఏజెన్సీ నుంచి మైదానం/నగర ప్రాంతాలకు బదిలీ చేయాల్సిందిగా వచ్చిన దరఖాస్తుల్లో ఏడింటిని అల్లూరి జిల్లా యంత్రాంగం పరిగణనలోకి తీసుకున్నట్టు తెలిసింది.

ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి తహసీల్దార్లు రాగా ఒకరికి విశాఖ జిల్లాలోనే పోస్టింగ్స్ ఇచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, ఆ తరువాత వర్షాలు, వరదలు రావడంతో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఇంకా పోస్టింగ్స్ ఇవ్వలేదు. ఈలోగా బదిలీలకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌లో పనిచేస్తున్న తహసీల్దార్లు మైదానం, నగరానికి వచ్చేందుకు దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం ఐటీడీఏ పరిధిలో ఉద్యోగి/అధికారి ఏకకాలంలో రెండేళ్లకు పైబడి పనిచేసినా..వయస్సు 50 ఏళ్లు దాటినా మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలి. ఈ నిబంధనల ప్రకారం పాడేరు ఏజెన్సీలో పనిచేస్తున్న ఎనిమిది మంది తహసీల్దార్లు బదిలీకి అర్హులుగా తేలారు. అందులో ఒకరు అక్కడే పనిచేయడానికి సుముఖత (స్పౌజ్ అక్కడే టీచరుగా పనిచేస్తున్నారు) వ్యక్తంచేయడంతో మిగిలిన ఏడుగురినీ అక్కడ నుంచి రిలీవ్ చేయడానికి అల్లూరి జిల్లా కలెక్టర్ సుముఖత వ్యక్తంచేశారని అంటున్నారు. ఏజెన్సీ నుంచి ఎంతమంది తహసీల్దార్లు కిందకు వస్తారో..అంతమందిని మైదానం/నగరం నుంచి ఏజెన్సీకి వెళ్లాలి. కానీ మైదానం/నగరంలో పనిచేస్తున్న తహసీల్దార్లు (50 ఏళ్ల కంటే తక్కువ వయస్సు, గతంలో ఏజెన్సీలో ఎప్పుడు పనిచేయనివారు) ఏజెన్సీకి వెళ్లేందుకు సుముఖంగా లేరని రెవెన్యూ వర్గాల్లో ప్రచారం సాగుతుంది. కొతమంది రాజకీయంగా తమకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి ఇక్కడే కొనసాగేందుకు అన్ని రకాలుగా పైరవీలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలో ఐదారుగురు తహసీల్దార్లు సర్వీస్‌లో బాగా జూనియర్లు. వారు కూడా కదలంటున్నారు. అయితే 58 ఏళ్లు దాటిన తహసీల్దారును మాత్రం ఏజెన్సీకి పంపేందుకు యత్నిస్తున్నట్టు తెలిసింది. అలాగే అనకాపల్లి జిల్లా నుంచి 55 ఏళ్లు దాటిన ఇద్దరు తహసీల్దార్లను ఏజెన్సీకి పంపాలని యత్నిస్తున్నారని చెబుతున్నారు. మరోవైపు బదిలీల విషయంలో ఐటీడీఏ నిబంధనలు అమలు చేయాలని, లేకపోతే న్యాయపోరాటం చేస్తామని ఏజెన్సీలో పనిచేస్తున్న కొందరు తహసీల్దార్లు అంటున్నట్టు తెలిసింది.

ఇదిలావుండగా నగరంలో పనిచేస్తున్న ముగ్గురు తహసీల్దార్లు అనకాపల్లి జిల్లాకు వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేశారు. కూటమికి చెందిన ప్రముఖుడొకరు తన నియోజకవర్గంలో పనిచేయాలని సూచించడంతో ఒకరు, మరో ఎమ్మెల్యే కోర్కె మేరకు ఇంకొక తహసీల్దారు అనకాపల్లి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. గతంలో ... మిగతా 8వ పేజీలో

చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మహర్దశ

- పీఎం ఉషా పథకం ద్వారా రూ.ఐదు కోట్లు విడుదల
- మౌలిక సదుపాయాలు, తరగతి గదులు, ల్యాబ్‌లు నిర్మాణం
- ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషితో విద్యార్థులకు తీరనున్న అవస్థలు



చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల

చింతపల్లి, సెప్టెంబరు 13: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మహర్దశ పట్టింది. కేంద్ర ప్రభుత్వం పీఎం ఉచ్చతార్ శిక్షా అభియాన్ ద్వారా రూ.ఐదు కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో కళాశాలలో పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు, అదనపు తరగతి గదులు, ల్యాబ్‌లు నిర్మించే బాధ్యతను ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఈడబ్ల్యూఐడీసీ)కు అప్పగించింది. 2026 నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.



చిన్న గదిలో నిర్వహిస్తున్న గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

చింతపల్లిలో 2008వ సంవత్సరంలో డిగ్రీ కళాశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2010వ సంవత్సరంలో 11 గదులతో కళాశాలకు భవనం నిర్మించింది. ఈ గదులు విద్యాబోధనకు, కార్యాలయం, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్ కోసం వినియోగిస్తున్నారు. కళాశాలలో బీఎస్సీ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, బోటనీ, జువాలజీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏ ఎకనామిక్స్, హిస్టరీ కోర్సులు ఉన్నాయి. ఈ కోర్సుల్లో సుమారు 1,200 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. తాజాగా కళాశాలకు ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్సు పీజీ కోర్సు మంజూరు చేసి 30 సీట్లు కేటాయించారు. ఈ ఏడాది నుంచే విద్యాబోధన ప్రారంభించనున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు సరిపడిన తరగతి గదులు అందుబాటులో లేవు. ఒకటి, రెండు తరగతులను కలిసి బోధన నిర్వహించాల్సి వస్తున్నది. విద్యార్థులకు పూర్తి స్థాయిలో ల్యాబ్‌లు అందుబాటులో లేవు. దీంతో కళాశాలకు పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం అవసరమైన నిధులను విడుదల చేసింది.

అందుబాటులోకి రానున్న అత్యాధునిక సదుపాయాలు

పీఎం ఉచ్చతార్ శిక్షా అభియాన్ ద్వారా విద్యార్థులకు అత్యాధునిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన రూ.ఐదు కోట్లలో రూ.3.5 కోట్లు జీ ప్లస్ వన్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు కేటాయించారు. ప్రస్తుత భవనం ఆధునికీకరణ, మరమ్మతులకు రూ.50లక్షలు, కళాశాలకు అవసరమైన ఫర్నీచర్, పరికరాల కోసం రూ.50లక్షలు, సాఫ్ట్ కాంపోనెంట్‌కి రూ.50లక్షలు కేటాయించారు. ఈ నిధులతో ప్రస్తుత భవనంపైన మొదటి అంతస్తులో 11 తరగతి గదులు, ల్యాబ్‌లు, సెమినార్ హాల్, ఇండోర్ క్రీడల విభాగం, విద్యార్థినీ, విద్యార్థులు, సిబ్బందికి వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మించనున్నారు. అలాగే 30 కంప్యూటర్లతో ప్రత్యేక ల్యాబ్, గ్రంథాలయం అందుబాటులోకి రానున్నది. అలాగే విద్యార్థులకు ... మిగతా 8వ పేజీలో

నిమ్మచెట్టు మరో చత్రాపల్లి

గ్రామాన్ని ముంచెత్తిన వరద

- కొట్టుకువచ్చిన కొండచరియలు, భారీ చెట్లు
- వరద ఉధృతి కారణంగా వాగు దాటి రాని గ్రామస్థులు
- ధారకొండ యువకులు సహాయక చర్యలకు వెళ్లడంతో వెలుగుచూసిన వైనం

సీలేరు, సెప్టెంబరు 13 : ఇటీవల కురిసిన వర్షాలకు చత్రాపల్లి వలే నిమ్మచెట్టు గ్రామాన్ని కొండచరియలు, భారీ చెట్లు, బురద ముంచెత్తాయి. గ్రామానికి ఆనుకొని వాగును గ్రామస్థులు దాట లేకపోవడంతో ఈ విషయం బాహ్య ప్రపంచానికి తెలియకుండా పోయింది. ధారకొండ యువకులు వరద బాధిత గ్రామాలకు సాయమందించేందుకు వెళ్లడంతో నిమ్మచెట్టు గ్రామానికి జరిగిన భారీ నష్టం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..

జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ శివారు నిమ్మచెట్టు గ్రామం ఉంది. వాయుగుండం ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు నిమ్మచెట్టు గ్రామంలో విధ్వంసం జరిగింది. నిమ్మచెట్టు వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఈ గ్రామానికి బాహ్య ప్రపంచంతో తెగిపోయాయి. ఈ గ్రామానికి విద్యుత్ సరఫరా, సెల్ సంకేతాలు నిలిచిపోయాయి. చత్రాపల్లిలో జరిగిన విధ్వంసమే ఇక్కడ కూడా జరిగింది. కొండచరియలు, భారీ చెట్లు, బురద గ్రామంపైకి కొట్టుకువచ్చాయి. అయితే ప్రాణ నష్టం వాటిల్లలేదు. అయితే ధారకొండకు చెందిన కొందరు యువకులు ఆ పంచాయతీలో వర్షాలకు దెబ్బతిన్న గ్రామాలకు వెళ్లి బాధితులకు కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం నిమ్మచెట్టు గ్రామానికి ధారకొండ యువకులు సహాయక చర్యల కోసం వెళ్లగా ఈ విషయం వెలుగుచూసింది. ఈ గ్రామం మరో చత్రాపల్లిని తలపించిందని ధారకొండ యువకులు తెలిపారు. గ్రామంలో ఎక్కడ చూసిన విరిగిపడిన కొండచరియలు.. ఇళ్లల్లోకి ... మిగతా 8వ పేజీలో



నిమ్మచెట్టు గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండలపై నుంచి కొట్టుకు వచ్చి కొండ చరియలు, భారీ చెట్లు.



నిమ్మచెట్టు గ్రామానికి నిత్యావసర సరకులు పంపిణీ చేయడానికి వెళ్లిన ధారకొండ యువకులు



భారీ వర్షాలకు నిమ్మచెట్టు గ్రామంలో నెలకొరిగిన విద్యుత్ స్తంభాలు

సీలేరు రహదారి పునరుద్ధరణ

ద్విచక్ర వాహనాలు, కార్లు, జీపుల రాకపోకలు

- మరో రెండు రోజుల్లో బస్సులు నడిచేలా చర్యలు
- ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు

సీలేరు, సెప్టెంబరు 13 : సీలేరుకు మరో రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో బస్సులు నడిచేలా చర్యలు చేపడుతున్నామని పాడేరు ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు అన్నారు. ప్రస్తుతం జీకేవీధి సీలేరు మధ్య చిన్న వాహనాలు, ద్విచక్ర వాహనాలు తిరిగేలా రహదారి పునరుద్ధరణ చర్యలు పూర్తి చేశామన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జీకేవీధి- సీలేరు మధ్య గల ఆర్‌అండ్‌బీ రహదారికి రూ.5 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తొలుత ద్విచక్ర వాహనాలు, కార్లు, జీపులు వంటి చిన్న వాహనాలు తిరిగేందుకు వీలుగా రహదారిని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ మార్గంలో లంకపాకలు, సంపంగిగొంది మార్గంలో రెండు చోట్ల వంతెనలు గాలిలో వేలాడుతున్న స్థితిలో ఉన్నాయని, వాటికి తాత్కాలికంగా సపోర్టులు పెట్టించామని ఈఈ బాలసుందరబాబు అన్నారు. ఈ వంతెనల వద్ద భారీగా నీరు ప్రవహిస్తుండడంతో కాంక్రీట్ పనులు చేసేందుకు వీలు లేకుండా ఉందన్నారు. ఈ రెండు వంతెలనకు పూర్తిగా కింద నుంచి సపోర్టులు ఏర్పాటు చేసిన తరువాత బస్సులు, భారీ వాహనాల రాకపోకలకు అనుమతిస్తామన్నారు. దీనికి మరో రెండు రోజుల సమయం పడుతుందన్నారు. అలాగే ధారకొండ ఘాట్ రోడ్డులో 5 ఎక్స్‌కవేటర్లతో, సీలేరు-ధారకొండ మధ్యలో 3 ఎక్స్‌కవేటర్లతో ... మిగతా 8వ పేజీలో



వలసగెడ్డ వంతెన పనులు శరవేగంగా సాగుతున్న దృశ్యం

క్రైం... crime news

సైబర్ క్రైమ్‌పై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13: సైబర్ క్రైమ్‌పై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి సీఐ టీవీ విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపిన వివరాలివి. మండలంలోని తుమ్మపాలకు చెందిన గరికిపాటి నాగవెంకట సాయి సతీష్ అనే వ్యక్తికి ఈ ఏడాది మే 15వ తేదీన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ మెసేజ్ వచ్చింది. ఇంటి వద్ద నుంచే జాబ్ చేసుకోవచ్చునని అజ్ఞాత వ్యక్తి లింక్ పంపాడు. దీంతో అతడు ఆ లింక్‌కు బయోడేటా పంపించాడు. సులువుగా డబ్బులు సంపాదించాలంటే లాభాలు వచ్చేలా పెట్టుబడులు పెట్టాలని ఆ మెసేజ్‌లో ఉంది. దీంతో సతీష్ ఆ లింకులో పేర్కొన్న అకౌంట్‌కు రూ.10 వేలు పంపాడు. అవతలి వ్యక్తి రూ.4,499 నీకు లాభం వచ్చిందని తిరిగి సతీష్‌కు పంపాడు. దీంతో 16 నుంచి 21వ తేదీ వరకు దఫదఫాలుగా రూ.5.68 లక్షలు అజ్ఞాత వ్యక్తి సూచించిన అకౌంట్‌లో సతీష్ డిపాజిట్ చేశాడు. ఇంకా డిపాజిట్ చేయమని కోరుతుండడంతో అనుమానం వచ్చి మే 21వ తేదీన సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు ఫిర్యాది పంపిన మొత్తంలో రూ.లక్షా 19వేలు అజ్ఞాత వ్యక్తి అకౌంట్‌కు వెళ్లకుండా ఫ్రీజ్ చేశారు. ఇదిలావుంటే, ఈ ఘటనపై గురువారం రాత్రి బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

50 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ హిమగిరి, వెనుక గంజాయి నిందితులు

అరకులోయ, సెప్టెంబరు 13: ఒడిశా నుంచి విశాఖపట్నం వెళ్తున్న వాహనంలో గంజాయి తరలిస్తూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారని సీఐ హిమగిరి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. గురువారం సాయంత్రం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కేరళకు చెందిన నజీబ్, ఒడిశా రాష్ట్రం చిత్రకుట్‌కు సమీపంలో ఉన్న బడపదర్ గ్రామానికి చెందిన కమ్మనస్ సీసా కారులో 50 కిలోలు గంజాయి తరలిస్తుండగా పట్టుబడ్డారన్నారు. ఈ గంజాయి చిత్రకుట్ ప్రాంతంలో కొనుగోలు చేసి విశాఖపట్నం మీదుగా కేరళకు తరలించే ప్రయత్నంలో పట్టుబడినట్టు చెప్పారు. ఈ గంజాయి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందన్నారు. 50 కిలోల గంజాయితో పాటు కారును స్వాధీనం చేసుకుని ఇద్దర్ని అరెస్టు చేశామని సీఐ చెప్పారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ ఆర్.సంతోశ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ఆరు కిలోల గంజాయి స్వాధీనం

అనంతగిరి, సెప్టెంబరు 13: ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న గంజాయి పట్టుకున్నట్టు ఎస్‌ఐ కరక రాము తెలిపారు. డముకు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అరకు వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రుద్రప్రతాప్‌సింగ్ నుంచి ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో నిందితుడు రిషబ్ దివ్వేది పరారీలో ఉన్నాడన్నారు. గంజాయిని ఒడిస్సా రాష్ట్రం పాడువా వద్ద కొనుగోలు చేసినట్టు దర్యాప్తులో తేలిందని చెప్పారు. రుద్రప్రతాప్‌సింగ్‌ను కోర్టులో హాజరుపరచగా, రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి ఒకరికి గాయాలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 13: గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి శుక్రవారం ప్రమాదవశాత్తు బోగీ నుంచి జారి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి విశాఖ పట్టణం వెళ్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కె.వెంకటాపురం గ్రామానికి చెందిన రామునాయుడు (37) ప్రయాణిస్తున్నాడు. బోగీ రద్దీగా ఉండడం వల్ల డోర్ వద్ద నిలబడి ఉన్నాడు. ఏలూరు సమీపంలో ప్రమాదవశాత్తు అతను జారిపడ్డాడు. తీవ్ర గాయాలకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.



గాయపడ్డ రామునాయుడు

బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతం కావాలి

» కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి అశోక్

కొత్తూరు, సెప్టెంబరు 13: బీజేపీ సభ్యత్వ నమోదును ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి, ప్రస్తుత విధాన సభ ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్ పిలుపునిచ్చారు. శుక్రవారం అనకాపల్లి ఎంపీ క్యాంపు కార్యాలయంలో బీజేపీ సభ్యత్వ నమోదుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి బూత్‌లో లక్ష్యం దిశగా పని చేయాలన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో దశాబ్ద కాలంగా బ్రహ్మాండమైన అభివృద్ధి, సంక్షేమ పాలన సాగుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కోలార్ మాజీ ఎంపీ మునిస్వామి, ఎస్సీ మోర్చా నాయకులు దేవానంద, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి కె.సురేంద్రమోహన్, జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పొన్నగంటి అప్పారావు, పట్టాభి పసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు సబ్బవరం విద్యార్థిని ఎంపిక

సబ్బవరం, సెప్టెంబరు 13 : ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని కె.వెంకటలక్ష్మి రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైంది. విశాఖ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న లంకెలపాలెంలో జరిగిన ఎంపిక ప్రక్రియలో ఆమె అద్భుతంగా రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు పాఠశాల హెచ్‌ఎం తిరుపతిరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం వజ్రపు కొత్తూరు జెడ్పీ హైస్కూల్లో శనివారం నుంచి జరగనున్న పోటీల్లో తలపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా శుక్రవారం అతనితో పాటు పీడీ అబ్దుల్ రెహ్మాన్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ శంకరరావు, జ్యోతిశ్రీ, సిబ్బంది ఆమెను అభినందించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

తాగునీటి సమస్యపై రోడ్డెక్కిన మహిళలు

» ఖాళీ బిందెలతో కోటవురట్లలో నిరసన

» ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం

» వరహా నదిలో నీరు తగ్గితేగానీ కొత్త పైప్‌లైన్ సాధ్యం కాదంటున్న అధికారులు



ఖాళీ బిందెలతో మహిళలు నిరసన ప్రదర్శన

కోటవురట్ల, సెప్టెంబరు 13: మేజర్ పంచాయతీ కోటవురట్లలో తాగునీటి సమస్యపై మహిళలు శుక్రవారం రోడ్డెక్కారు. ఖాళీ బిందెలతో నిరసన ప్రదర్శనగా వెళ్లి పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. గ్రామానికి గత వారం రోజుల నుంచి తాగునీరు సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కోటవురట్ల శివారు గవరపేటలో వరహా నది ఒడ్డున నిర్మించిన భారీరక్షిత మంచినీటి పథకం ట్యాంకు నుంచి గవరపేట, కోటవురట్ల పంటపొలాలు మీదగా వరహానది నుంచి సంతబయలు, ముస్లిం తదితర వీధులకు తాగునీటి పైపులైన్ వేశారన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పైపులు వరహా నది ఉధృతికి కొట్టుకుపోయాయన్నారు. ఈ కారణంగా గ్రామానికి గత వారం రోజుల నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామన్నారు. అయినప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారని వాపోయారు. ఇదిలావుంటే, ఎగువన జలాశయాల నుంచి నీరు విడుదల చేయడంతో పాటు భారీ వర్షాలకు వరహానది ఉధృతంగా ప్రవహిస్తుంది. పైపులు కొట్టుకుపోవడంతో కొత్త పైప్‌లైన్ వేయాలంటే నదిలో నీరు తగ్గితే గాని సాధ్యం కాదని అధికారులు అంటున్నారు. భారీ వర్షాలు పడుతున్నప్పుడు పైప్‌లు కొట్టుకుపోతున్నా ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ అధికారులు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి సమయాల్లో దూర ప్రాంతం నుంచి నీటిని మోసుకుని రావడం కష్టంగా ఉందని తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రతిరోజూ ట్యాంకర్ల ద్వారా తమకు నీటిని సరఫరా చేయాలని వారంతా డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ, ఏఈలకు ఎంపీటీసీ పి.సూర్యారావు, గ్రామ మహిళలు సమస్యను వివరించారు.



పంచాయతీ కార్యాలయంలో బైఠాయించిన మహిళలు

పరిశ్రమల సహకారంతో దోమతెరల పంపిణీ

» జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఉచితంగా దోమ తెరలు పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ శుక్రవారం ఇక్కడ తెలిపారు. పరిశ్రమల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. సీఎస్ఆర్ నిధుల కింద అచ్యుతాపురం మెస్సర్ టయోస్సు రేర్ ఎర్త్స్ సంస్థ పదివేల దోమ తెరలను ప్రభుత్వ యంత్రాంగానికి అందజేశారన్నారు. అదేవిధంగా అరబిందో ల్యాబొరేటరీస్, జేఎన్‌పీసీ ఫార్మాసిటీ పరవాడ 2500 దోమ తెరలు అందజేశారన్నారు. జిల్లాలో 30వేల దోమ తెరలు పంపిణీకి వివిధ పరిశ్రమల యాజమాన్యాలను కోరినట్టు చెప్పారు. అందులో భాగంగా గత వారం పదివేల దోమ తెరలను బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల విద్యార్థులకు, మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసించే ప్రజలకు పంపిణీ చేశామని కలెక్టర్ వివరించారు. శుక్రవారం 12,500 దోమ తెరలను పైన పేర్కొన్న రెండు కంపెనీల హెచ్ఆర్ మేనేజర్లు మురళీధర్ రావు, రామకృష్ణలు డీఆర్‌వో బి.దయానిధి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రామారావు, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీధర్‌లకు అందజేశారని తెలిపారు. వీటి పంపిణీకి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పారిశ్రామికవేత్తల సహకారంతో మరిన్ని దోమ తెరలు పంపిణీ చేయనున్నామని ఆమె వివరించారు.

ఎండీఎం నిర్వాహకులపై నిర్బంధం తగదు

» నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి



విలేకరులతో మాట్లాడుతున్న గూనూరు వరలక్ష్మి

చోడవరం, సెప్టెంబరు 13: పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులపై అధికారులు అనవసర ఆంక్షలు పెడుతున్నారని, ఇలాగైతే పథకం నడపడం కష్టమని పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద భోజన పథకం నిర్వాహకులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. వంద మంది పిల్లలు దాటిన పాఠశాలల్లో ఐదు లేదా ఆరు కౌంటర్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు భోజనాలు పెట్టాలని అధికారులు ఇచ్చిన ఆదేశాలు నిర్వాహకులకు ఇబ్బందికరంగా ఉన్నాయన్నారు. కనీస స్థాయిలో సిబ్బంది లేకుండా ఇదెలా సాధ్యమని ప్రశ్నించారు. ఒక వైపు పాఠశాలల్లో ఉన్న కార్మికులను తొలగించడం లేదా కుదించడం చేస్తూ.. మరోవంక ఐదారు కౌంటర్లు పెట్టాలని ఆదేశాలు ఇవ్వడం, హెచ్‌ఎంలతో నిర్బంధం పెట్టడం వంటి చర్యలు ఎంతమాత్రం తగవన్నారు. సౌకర్యాలు లేకపోయినా పథకం అమలులో కష్టపడుతున్న నిర్వాహకులను ఏదో విధంగా బయటకు పంపించాలన్నదే ప్రభుత్వ వ్యూహంలా ఉందని ఆరోపించారు. ఇప్పటికైనా ఇటువంటి అర్థరహిత నిర్ణయాలు చేయడం, నిబంధనలు విధించడం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంఘం నేతలు బుచ్చిరాజమ్మ, లక్ష్మి, మంగమ్మ, హసీనా తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి హిందీ నేర్చుకోవాలి

» జిల్లా విద్యా శాఖాధికారి వెంకటలక్ష్మమ్మ



ఉత్తమ హిందీ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రభాకర్‌ను సత్కరిస్తున్న డీఈవో

చీడికాడ, సెప్టెంబరు 13 : ప్రతి విద్యార్థి హిందీ నేర్చుకోవడం అవసరమని జిల్లా విద్యా శాఖాధికారి వెంకటలక్ష్మమ్మ కోరారు. చుక్కపల్లి హైస్కూల్‌ను శుక్రవారం సాయంత్రం డీఈవో సందర్శించారు. హిందీ దివాస్ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ అభ్యసన సామగ్రిని పరిశీలించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం బీవీ రమణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జాతీయ భాష హిందీని క్షుణ్ణంగా నేర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ఉత్తమ హిందీ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చీమకుర్తి ప్రభాకర్‌ను ఆమెతో పాటు పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డీఈవో చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు జీపీఏ నాయుడు, తురువోలు హైస్కూల్ హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జోలాపుట్టు సరిహద్దు వంతెనకు మరమ్మతు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 13: మండలంలో ఆంధ్రా, ఒడిశా ప్రాంతాలను కలిపే జోలాపుట్టు సరిహద్దు వంతెన మరమ్మత్తు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల వరదనీటి ఉధృతికి వంతెన దెబ్బతినడంతో అటుగా రాకపోకలు స్తంభించిపోయిన విషయం తెలిసిందే. పలువురు నాయకులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు దగ్గరుండి తాత్కాలిక మరమ్మతు పనులను చేయిస్తున్నారు. ఇనుప వంతెనకు ఇరువైపులా మట్టి పోస్తున్నారు. పాదచారులు రాకపోకలు సాగించేలా మరమ్మతులు చేస్తున్నారు. నిధులు మంజూరైన వెంటనే పూర్తి స్థాయిలో పనులు చేపట్టనున్నట్టు తెలిసింది.



జోలాపుట్టు సరిహద్దు వంతెన పనులు చేపడుతున్న దృశ్యం

సికింద్రాబాద్-శ్రీకాకుళం మధ్య ప్రత్యేక ఏసీ రైలు

విశాఖపట్నం, సెప్టెంబరు 13: పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా సికింద్రాబాద్, శ్రీకాకుళం రోడ్డు మధ్య ప్రత్యేక ఏసీ రైలు సర్వీసులు ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 07487 నంబరు గల ప్రత్యేక ఏసీ రైలు అక్టోబరు 2 నుంచి నవంబరు 6 వరకు ప్రతి బుధవారం రాత్రి 7.40 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.10 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.00 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07488 నంబరు గల ఏసీ ప్రత్యేక రైలు అక్టోబరు 3 నుంచి నవంబరు 7 వరకు గురువారం సాయంత్రం 5.00 గంటలకు శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌లో బయలుదేరి రాత్రి 6.47 గంటలకు దువ్వాడ, మరుసటి రోజు ఉదయం 9.50 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ సర్వీసులు 17 థర్డ్ ఏసీ, రెండు మోటారు కార్ కోచ్‌లతో నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, ఎలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

పలు రైళ్ల గమ్యం కుదింపు...రీ షెడ్యూల్

భద్రత నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విశాఖ-పలాస మధ్య నడిచే 07470, 07471 నంబర్లు గల మెము రైళ్లు ఈ నెల 19, 21 తేదీల్లో విశాఖ-శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య రాకపోకలు సాగిస్తాయ డీసీఎం చెప్పారు. ఈ నెల 18న సాయంత్రం 6.50 గంటలకు పాండిచ్చేరిలో బయలుదేరాల్సిన పాండిచ్చేరి-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (1289) రాత్రి 9.35 గంటలకు (రెండు గంటల 45 నిమిషాలు), ఈ నెల 18, 20 తేదీల్లో మధ్యాహ్నం 1.40 గంటలకు కేఎస్ఆర్ బెంగళూరులో బయలుదేరాల్సిన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18464) సాయంత్రం 4.10 గంటలకు (రెండు గంటల 30 నిమిషాలు) ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేసినట్టు పేర్కొన్నారు.

27న తపాలా అదాలత్

విశాఖపట్నం, సెప్టెంబరు 13: ఎంవీపీ కాలనీలోని ఆర్ఎంఎస్ కార్యాలయం ఆవరణలో ఉన్న పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయంలో ఈనెల 27న తపాలా అదాలత్ నిర్వహించనున్నట్టు ఆ శాఖ విశాఖపట్నం రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ సాగర్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు పరిష్కారానికి ఈ అదాలత్‌ను వినియోగించుకోవాలని కోరారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను ఈ నెల 23వ తేదీలోగా 115వ తపాలా అదాలత్ అన్న శీర్షికతో కేవీడీ సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టు మాస్టర్ జనరల్ కార్యాలయం, విశాఖపట్నం 530017 చిరునామాకు పంపించాలని ఆయన సూచించారు.

కల్యాణపులోవకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

» రెండు గేట్లు ఎత్తి వంద క్యూసెక్కుల నీరు విడుదల



సర్పానదిలోకి వెళ్తున్న కల్యాణపులోవ నీరు

రావికమతం, సెప్టెంబరు 13: పరివాహక ప్రాంత ఎగువ కొండల్లో కురుస్తున్న వర్షాలతో మండలంలో కల్యాణపులోవ రిజర్వాయర్‌కు వరద ప్రవాహం కొనసాగుతుండంతో ఎత్తిన రెండు గేట్లు మూడో రోజైన శుక్రవారం కూడా కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం వంద క్యూసెక్కుల మేర అదనపు నీటిని విడిచి పెడుతున్నామని జేఈ సత్యనారాయణదొర తెలిపారు. 460 అడుగుల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్ పరిధిలో భారీ వర్షాలు లేనప్పటికీ పరివాహక ప్రాంత ఎగువ కొండ గెడ్డల ద్వారా ఇన్‌ఫ్లో ఎఫఫ75 క్యూసెక్కుల మేర రిజర్వాయర్‌లోకి చేరుతోంది. దీంతో జలాశయం నీటి నిల్వలు 459.00 అడుగులకు మించకుండా స్థిరీకరిస్తున్నట్టు జేఈ తెలిపారు.

19 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

లంకెలపాలెం, సెప్టెంబరు 13: జీవీఎంసీ 84వ వార్డు సాలాపువానిపాలెంలో వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 19 నుంచి రాష్ట్రస్థాయి పురుషులు, మహిళల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధి సాలావు మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు విద్యుత్ దీప కాంతుల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పోటీలను ప్రారంభించనున్నారని వివరించారు. ఇందులో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ30 వేలు, ద్వితీయ స్థానానికి రూ.20 వేలు, తృతీయ స్థానానికి రూ.15 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులతో పాటు మెమెంటోలను అందజేస్తామన్నారు. ఔత్సాహికులు 99495 10771 నంబరులో సంప్రదించాల్సింగా ఆయన కోరారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం : తల్లీబిడ్డ క్షేమం

నర్సీపట్నం, సెప్టెంబరు 13: పురుడు పోసుకోవడానికి 108 అంబులెన్స్‌లో ఏరియా ఆస్పత్రి తరలిస్తున్న గర్భిణికి మార్గంమధ్యలో సుఖ ప్రసవం జరిగింది ఆడ శిశువు జన్మించింది. గొలుగొండ మండలం కొత్త ఎల్లవరం గ్రామానికి చెందిన కూండ్రపు హారికకు శుక్రవారం ఉదయం పురుటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి ఫోన్ చేశారు. మాకవరపాలెం 108లో నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో హారికకు నొప్పులు అధికంగా రావడంతో ఈఎంటీ రేవంత్, పైలెట్ శ్రీనివాసరావు పురుడు పోశారు. ప్రస్తుతం ఆడ శిశువు, తల్లి క్షేమంగా ఉన్నారు.



108 వాహనంలో పుట్టిన ఆడబిడ్డతో సిబ్బంది

బ్యాంకులో నగదు జమ చేయకపోవడం నేరం

» డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ



విచారణ చేస్తున్న డీసీసీబీ సీఈవో వర్మ

రోలుగుంట, సెప్టెంబరు 13: రైతుల నుంచి వసూలు చేసిన వ్యవసాయ రుణాల బకాయిల నగదు బ్యాంకులో జమ చేయకుండా సిబ్బంది జీతాలకు వాడుకోవడం చట్ట విరుద్ధమని డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ అన్నారు. దీనిపై రైతుల నుంచి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఆయన శుక్రవారం రోలుగుంట, జానకిరామపురం పీఏసీఎస్‌లను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ జానకిరామపురం, రోలుగుంట పీఏసీఎస్‌లలో రైతులు చెల్లించిన వ్యవసాయ రుణాల నగదును సిబ్బంది బ్యాంకులో జమ చేయకుండా జీతాలకు వాడుకుంటున్నారని తెలిపారు. ఈ విధంగా రోలుగుంట పీఏసీఎస్‌లో సుమారు రూ.7 లక్షలు రైతులు చెల్లించిన డబ్బులు జమ చేయలేదని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేపడుతున్నట్టు చెప్పారు. ఈ విచారణలో ఆడిటర్ శ్రీనివాసరావు, మేనేజర్ నాయుడు పాల్గొన్నారు.

ఏపీ బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడికి సత్కారం



కృష్ణ దంపతులను సత్కరిస్తున్న న్యాయవాదులు

చోడవరం, సెప్టెంబరు 13: ఏపీ బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్ దంపతులను స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం సత్కరించారు. శుక్రవారం పట్టణంలోని స్వయంభూ విఘ్నేశ్వరుడిని దర్శించుకోవడానికి వచ్చిన ఆయనను బార్ అసోసియేషన్ న్యాయవాదులు, ఏజీపీలు సాదరంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ వేసలపు వెంకటరావు, న్యాయవాదులు పప్పల రమణమూర్తి, చీపురుపల్లి సూర్యనారాయణ, అల్లు గిరిధర్, వెంకటరావు, పాత్రుడినాయుడు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, డీఎంహెచ్‌వో జమాల్ బాషా

నులిపురుగుల దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

పాడేరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగుల దినోత్సవ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, డీఎంహెచ్‌వో జమాల్ బాషా తదితరులు శుక్రవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17న జిల్లాలోని అన్ని విద్యాలయాల్లో బాలలకు నులిపురుగుల నివారణకు 3.8 లక్షల మాత్రలు సిద్ధం చేశామని చెప్పారు. ప్రతీ విద్యార్థికి విధిగా ఈ మాత్రలు వేయాలని సూచించారు. అధికారులు, విద్యా శాఖాధికారులు, వైద్య సిబంది సమన్వయంతో నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య శాఖ డీఎస్‌వో కైలాశ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీహెచ్ ట్రైబల్ సెల్‌లో డీఎంహెచ్‌వో తనిఖీలు

పాడేరు రూరల్, సెప్టెంబరు 13: విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో ఉన్న ట్రైబల్ సెల్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి షేక్ జమాల్ బాషా శుక్రవారం అకస్మింగా తనిఖీ చేశారు. ముందుగా తుఫాన్ ప్రభావంతో ఇటీవల అల్లూరి జిల్లాలో కురిన భారీ వర్షాలకు గాయాలపాలై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఇటీవల మెరుగైన వైద్య సేవలు కోసం తరలించిన కొర్రా రామారావు, కొర్రా పండన్న, కొర్రా సుమిత్ర, కొర్రా సుబ్బారావు ఆరోగ్య స్థితిని పరిశీలించి, వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు నిర్ధారించారు. కేజీహెచ్‌కు వచ్చే రోగులకు ట్రైబల్ వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్‌వో సూచించారు. అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లా, మన్యం, పార్వతీపురం జిల్లాల నుంచి వచ్చే గిరిజన రోగుల కోసం ట్రైబల్ సెల్‌లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. అలాగే సెల్‌లో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేజీహెచ్ వైద్యులు సంపత్‌కుమార్, రవీంద్ర, గాయిత్రి పాల్గొన్నారు.

సోప్ యూనిట్ సిబ్బంది సమస్యలపై వినతి


మాజీ మంత్రి కిడారికి వినతిపత్రం అందిస్తున్న సోప్ యూనిట్ సిబ్బంది

పాడేరు రూరల్, సెప్టెంబరు 13: అరకు జీసీసీ సోప్ యూనిట్ సిబ్బంది సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతూ టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. పాడేరులోని ఆయన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ సోప్ యూనిట్‌లో 23 మంది పనిచేస్తున్నామని, రెండు నెలలుగా తమకు జీతాలు చెల్లించకపోగా వేర్వేరు విభాగాల్లో పనులకు పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై శ్రావణ్‌కుమార్ వెంటనే స్పందించి జీసీసీ ఎండీతో ఫోన్‌లో మాట్లాడారు. సోప్ యూనిట్ సిబ్బంది సమస్యను పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పొద్దు అమ్మన్న, బాకూరు, దారెల సర్పంచులు బాకూరు వెంకటరమణ, పాంగి పాండురంగస్వామి, నాయకులు వి.సింహాద్రిదొర, దాసుబాబు, బండి ప్రభాకర్, కొర్రా పూర్ణకుమారి, కొర్రా జ్ఞానమణి, గుంట కమన్‌దన్, ఎస్.రామసుందర్ పాల్గొన్నారు.

టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సింహాచలం మృతి

మాజీ మంత్రి శ్రావణ్, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి, నాయకుల నివాళులు


సింహాచలం మృతదేహంపై టీడీపీ జెండాను కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, తదితరులు... (ఇన్‌సెట్‌లో) సింహాచలం (ఫైల్ ఫొటో)

పాడేరు రూరల్, సెప్టెంబరు 13: తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గబ్బాడ సింహాచలం (45) శుక్రవారం మృతి చెందారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న సింహాచం విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతూ తుది శ్వాస విడిచారు. గుడివాడలోని ఆయన నివాస గృహానికి టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సింహాచలం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సింహాచలం మృతి పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని వారు భరోసా ఇచ్చారు. అలాగే పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులు బొర్రా నాగరాజు, బొర్రా విజయరాణి, డి.వెంకటకుమారి, కేవీ సురేష్‌కుమార్, కృష్ణ, వంజంగి కాంతమ్మ, కేవీ రమేష్‌నాయుడు, జి.శివకుమార్, బుద్ద జ్యోతికిరణ్, డప్పోడి వెంకటరమణ, బి.శ్రీను, కొట్టగుళ్లి రమేష్‌నాయుడు, బొడ్డేటి వరలక్ష్మి, గోపి, జె.తిరుపతి, బి.జగదీష్, బి.రాజేంద్ర, జి.అప్పలనాయుడు, సర్పంచులు కొట్టగుళ్లి ఉషారాణి, పి.పాండురంగస్వామి, బి.వెంకటరమణ, టి.సత్యనారాయణ, పి.శశిభూషణ్, పిన్నయ్యదొర సింహాచలం, వంతాల కొండలరావు, కిముడు కల్యాణం, కిడారి రమేశ్ మృతదేహానికి నివాళులర్పించారు.

నిమ్మచెట్టు మరో చత్రాపల్లి


... 5వ పేజీ తరువాయి

బురదకొట్టుకు రావడం... విద్యుత్ స్తంభాలు విరిగిపడిన దృశ్యాలు కనిపించాయి. గ్రామానికి ఆనుకొని నిమ్మచెట్టు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గ్రామస్థులు బయటకు వచ్చి తమ గోడును చెప్పుకునేందుకు అవకాశం లేకపోయింది. దీంతో ఇక్కడ జరిగిన విధ్వంసం బాహ్య ప్రపంచానికి తెలియరాలేదు. నిమ్మచెట్టు గ్రామాన్ని అధికారులు, పాలకులు సందర్శిస్తే వాస్తవ పరిస్థితులు వెలుగు చూస్తాయని ధార కొండ యువకులు అంటున్నారు.తమను ఆదుకోవాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

సీలేరు రహదారి పునరుద్ధరణ

..5వ పేజీ తరువాయి

పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. సీలేరు-డొంకరాయి మార్గంలో వలసగెడ్డ వంతెన గండి పూడ్చివేత పనులు సాగుతున్నాయన్నారు. ఈ వంతెనపై శనివారం నుంచి సీలేరు-భద్రాచలం, రాజమహేంద్రవరం, విజయవాడ బస్సులు నడిచేలా పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశామన్నారు. అనంతరం వలసగెడ్డ వంతెన పనులను పరిశీలించి మంగంపాడు, పాలగెడ్డ వరకు రహదారి పరిస్థితిని పరిశీలించారు. ఆయన వెంట చింతపల్లి డీఈఈ రామారావు, జేఈలు భరతుడు, ప్రసాద్ ఉన్నారు.


గాలిలో వేలాడుతుండటంతో వంతెన కూలిపోకుండా కర్రలు సపోర్డులను ఏర్పాటు చేసిన దృశ్యం

బీమా క్రెడిట్ కార్డు వినియోగించుకోండి

- 40 మంది తఫాన్ బాధిత రైతులకు రూ.19 లక్షలు మంజూరు
- పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు సిహెచ్.నరసింహులు


సమావేశంలో మాట్లాడుతున్న డీడీ నరసింహులు

పాడేరు రూరల్, సెప్టెంబరు 13: జిల్లాలో తుఫాన్ ప్రభావంతో పశువుల నష్టానికి గురైన రైతులు బీమా క్రెడిట్ కార్డును సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు సిహెచ్.నరసింహులు సూచించారు. పాడేరు పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాలకు చెందిన పశు వైద్యులు, ఉద్యోగులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని వివిధ మండలాల్లో ఇటీవల ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో 39 పెద్ద పశువులు, 20 మేకలు, 37 గొర్రెలు, సన్నజీవులు, 150 నాటుకోళ్లకు మృతి చెందినట్టు ఫిర్యాదులు అందాయన్నారు. బాధిత రైతులకు రూ.11.03 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. అలాగే గతంలో ఏర్పడిన తుఫాన్‌లో పశువులను నష్టపోయిన 40 మంది రైతులకు ప్రభుత్వం నుంచి రూ.19 లక్షలు విడుదలయ్యాయని చెప్పారు. ఈ నిధులను వారం రోజుల్లోగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారన్నారు. ఇంకా ఎవరైనా పశు నష్టానికి గురైన రైతులు ఉంటే సమాచారాన్ని సేకరించాలని సిబ్బందికి ఆదేశించారు. మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం వల్ల కలిగే లాభాలపై రైతులకు వివరించాలని డీడీ సూచించారు. ఆవులకు గాలికుంటు వ్యాధి రాకుండా ఎఫ్ఎండీసీపీ వ్యాక్సిన్‌ను, మేకలు, గొర్రెలకు పీపీఆర్, చిన్నదూడలకు బ్రుసెల్ల వ్యాక్సిన్‌ను వేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పశు వైద్యాధికారులు కేవీ.వరప్రసాద్, కె.చరణ్, కేవీ.రాజీవ్‌కిశోర్, కేకే.ప్రియదర్శిని, పి.సృజనకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

19న పాడేరులో మెగా జాబ్ మేళా

పాడేరు రూరల్, సెప్టెంబరు 13: స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల్లో ఈ నెల 19వ తేదీన మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ కోరారు. శుక్రవారం ఆయన డీఆర్‌డీఏ పీడీ మురళి, ఎల్‌డీఎం నాయుడుతో కలిసి జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల పాడేరులో ఆ రోజు 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఐదు కంపెనీలతో ఈ మేళా నిర్వహిస్తారన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల లోపు మధ్య పదో తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమో, డిగ్రీ, బీటెక్ ఆపై చదువులు పూర్తిచేసిన యువతీ, యువకులు ఇంటర్వ్యూకు పాన్ కార్డు, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాల జెరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల జీతం ఉంటుందన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 6302636174, 9398338105 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అరకు క్రీడా పాఠశాలలో సీట్ల భర్తీకి 17న బ్యాటరీ పరీక్షలు

పాడేరు రూరల్, సెప్టెంబరు 13: అరకు బాలుర క్రీడా పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి జోనల్ స్థాయిలో ఈ నెల 17వ తేదీన బ్యాటరీ పరీక్షలు నిర్వహిస్తామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో 30 సీట్లు, ఏడులో ఎనిమిది సీట్లు, తొమ్మిదిలో మూడు సీట్ల చొప్పున భర్తీకి నిర్వహిస్తున్న ఈ పరీక్షకు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఆయా తరగతులు చదువుతున్న గిరిజన బాలురు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి గల బాలురు ఈ నెల 17వ తేదీన నేరుగా అరకుస్పోర్ట్స్ స్కూల్‌కు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణపత్రం, పాస్ ఫొటోతో హాజరు కావాలన్నారు. జోనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన బాలురుకు రాష్ట్ర స్థాయిలో ఈ నెల 23వ తేదీన అరకువేలి స్పోర్ట్స్ స్కూల్‌లో బ్యాటరీ పరీక్ష నిర్వహిస్తారని ఆయన వివరించారు.

ఉపాధ్యాయురాలు సత్యవతికి సన్మానం

చింతపల్లి, సెప్టెంబరు 13: చౌడుపల్లి పాఠశాలలో రిటైర్డ్ ఉపాధ్యాయురాలు సత్యవతి దంపతులకు సహోపాధ్యాయులు శుక్రవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కన్వీనర్ డీజీ నాథ్ మాట్లాడుతూ మైదాన ప్రాంతాల నుంచి రెండేళ్ల ముందు గిరిజన ప్రాంతానికి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయురాలు సత్యవతి క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేశారన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1, 2 పనసల ప్రసాద్, గెమ్మెలి బోడంనాయుడు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సాగిన రామరాజుపడాల్, చౌడుపల్లి హెచ్ఎం కుడుముల కాంతారావు, గిరిజన ఉద్యోగుల సంఘం, వివిధ ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులు యూవీ గిరి, గెమ్మెలి మోహన్‌రావు, బౌడు గంగరాజు, కొర్ర మత్స్యలింగం, దేపూరి శశి కుమార్, కుడుముల వెంకట రమణ, అభ్యుదయ రైతు కరుణానిధి పాల్గొన్నారు.

చత్రాపల్లి గిరిజనులకు నిత్యావసర సరకులు

చింతపల్లి, సెప్టెంబరు 13: కొండచరియలు విరిగిపడి సర్వస్వం కోల్పోయిన చత్రాపల్లి గిరిజనులకు సహాయం చేసేందుకు నిత్యావసర సరకులు, దుస్తులు సేకరించామని టీడీపీ నేత రీమల ఆనందరావు తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ చత్రాపల్లి గిరిజనులకు సహాయార్థం చింతపల్లి ప్రజలు బియ్యం, నూనె, పంచదార, టీపొడి, పప్పులు, ఉప్పు, కూరగాయలు, వంటపాత్రలు, దుస్తులు అందజేశారన్నారు. వీటిని బాధితులకు శనివారం పంపిణీ చేస్తామని చెప్పారు. చత్రాపల్లి గిరిజనులను ప్రజలందరూ తమకు తోచిన సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత వసుపరి శ్రీనువాసరావు, టీడీపీ నేత దురియా రామకృష్ణ, చింతపల్లి మహిళలు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 13: చత్రాపల్లి గిరిజనులకు చింతపల్లి మండలం తాజంగి గ్రామ పంచాయతీ రామాలయం సేవా సంఘం యువకులు దుస్తులు పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక ప్రజల నుంచి సేకరించిన దుస్తులు, వ్యక్తిగత నిధులతో కొనుగోలు చేసిన దుస్తులను సప్పర్ల పునరావాస కేంద్రానికి తీసుకొచ్చి గిరిజనులకు పంపిణీ చేశారు. పునరావాస కేంద్రాల్లోని ఆదివాసీలు, గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఇక్కడే భోజనాలను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో యువకులు మాట్లాడుతూ ప్రతి ఏటా వినాయక మండపంలో అన్నసమారాధన నిర్వహిస్తామని, ఈ ఏడాది చత్రాపల్లి గిరిజనులకు భోజనాలు పెట్టి దుస్తులు అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రామాలయం సేవా సంఘం అధ్యక్షుడు పెనుమల క్రాంతికిరణ్, సభ్యులు డాక్టర్ జగదీశ్, శెట్టి మోహన్‌రావు, వెంగడ సధ, పెనుమాల అశోక్ కుమార్, బొర్ర నూకరాజు, దురియా ధర్మ, మోష్య నాని, శెట్టి శంకర్‌రావు, గొల్లోరి శ్యాంసుందర్ పాల్గొన్నారు.

చత్రాపల్లి బాధితులకు వైసీపీ నేతల పరామర్శ

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 13: చత్రాపల్లి గిరిజనులను జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎంపీ తనుజరాణి, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శుక్రవారం పరామర్శించారు. గిరిజనులు బస చేసిన సప్పర్ల పునరావాస కేంద్రానికి వచ్చి బియ్యం, నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండచరియలు విరిగి పడి మృతి చెందిన మహిళ కుటుంబానికి అందజేసే పరిహారం పెంచాలన్నారు. అలాగే గాయపడ్డ గిరిజనులు, ఆస్తులు నష్టపోయిన కుటుంబాలకు పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు అనుషదేవి, బోయిన కుమారి, జడ్పీటీసీ సభ్యులు పోతురాజు బాలయ్య, డొండ రాంబాబు, పైలా రాజు, సూర్యనారాయణ, కూడా బొంజుబాబు, మోరి రవి పాల్గొన్నారు.

పాడేరు ఎమ్మెల్యేకు కార్యకర్తల సత్కారం

కొయ్యూరు, సెప్టెంబరు 13: మండలంలోని వైసీపీ శ్రేణులు శుక్రవారం పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజును సత్కరించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం మొదటిసారిగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగ రమేష్‌బాబు, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, నాయకులు జల్లి బాబులు, గాడి సత్యనారాయణ, సత్యవతి, రాజులమ్మ, సూరిబాబు, బిడజాన అప్పారావు, జల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జలాశయాల్లో కొనసాగుతున్న నీటి విడుదల

- బలిమెల నుంచి 20 వేలు క్యూసెక్కులు, గుంటవాడ నుంచి 7 వేలు, డొంకరాయి నుంచి 4 వేల క్యూసెక్కుల నీరు విడుదల..


బలిమెల జలాశయం నుంచి విడుదల చేస్తున్న నీరు

సీలేరు, సెప్టెంబరు 13: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని బలిమెల, గుంటవాడ, డొంకరాయి జలాశయాల నుంచి శుక్రవారం కూడా దిగువకు నీటి విడుదల కొనసాగిస్తున్నారు. సీలేరు నదీ పరీవాహక ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ ఆంధ్రా, ఒడిశా ఉమ్మడి జలాశయమైన బలిమెలకు జోలాపుట్, డుడుమ, నదీ పరివాహక ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లోస్ వచ్చి చేరుతున్నాయి. బలిమెల పూర్తి స్థాయి నీటిమట్టం 1516 అడుగుల కాగా, ఇక్కడ 1512 అడుగులు దాటితే జలాశయం పరివాహక ప్రాంతాల గ్రామాలు ముంపునకు గురవుండడంతో నీటిమట్టం 1512 అడుగుల కంటే పెరగకుండా ఒడిశా అధికారులు దిగువకు నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కూడా బలిమెల జలావయం నుంచి దిగువన ఉన్న గుంటవాడ (సీలేరు)కు 20 వేలు క్యూసెక్కుల నీటి విడుదలను కొనసాగించారు. బలిమెల నుంచి గుంటవాడకు నీరు వచ్చి చేరుతుండటంతో గుంటవాడలో 1355.0 అడుగు నీటి మట్టం కొనసాగుతున్నది. గుంటవాడ నుంచి దిగువకు ఒక గేటు ద్వారా 7 వేల క్యూసెక్కులు మాత్రమే జెన్‌కో అధికారులు విడుదల చేస్తున్నారు. అలాగే జలవిద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం మరో ఎనిమిది వేల క్యూసెక్కులు విడుదల చేస్తూ గుంటవాడ జలాశయంలో నీటి మట్టం ప్రమదస్థాయికి చేరుకోకుండా చర్యలు చేపడుతున్నారు. సీలేరు నుంచి విడుదల అయిన నీరు డొంకరాయిలో వచ్చి చేరుతుండటంతో ఇక్కడ నీటిమట్టం పెరగకుండా జలాశయం రెండు గేట్లు ద్వారా నాలుగు వేల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి కోసం కెనాల్‌కు 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డొంకరాయి జలాశయంలో శుక్రవారం సాయంత్రం నాటికి 1030 అడుగుల నీటి మట్టం కొనసాగుతుందని సీలేరు కాంప్లెక్సు జెన్‌కో అధికారులు తెలిపారు.

చత్రాపల్లిలో మోడల్ హౌసింగ్ కాలనీ నిర్మించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స



మాట్లాడుతున్న సీపీఎం నేత అప్పలనర్స

పాడేరు రూరల్, సెప్టెంబరు 13: చత్రాపల్లి బాధితులకు మోడల్ హౌసింగ్ కాలనీని ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొండచరియలు విరిగిపడి నివాస గృహలను కోల్పోయిన చత్రాపల్లి బాధితులను ఆదుకుంటామంటున్నారే తప్ప అధికారులు స్పష్టమైన ప్రకటన చేయడం లేదన్నారు. మృతిరాలి కుటుంబానికి పరిహారం అందించడంతో పాటు గాయపడిన వారికి రూ.లక్ష, ఇల్లు కోల్పోయిన వారికి రూ.10 లక్షలు మంజూరు చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో సుమారు పది వేల ఎకరాల భూములను రైతులు నష్టపోయారన్నారు. నాయకులు బి.చిన్నయ్యపడాల్, ఎ.బుజ్జిబాబు, ధనుంజయ్, జి.సత్యనారాయణ, బాలయ్య బృందం పర్యటించిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించి బాధితులకు పరామర్శించి ధైర్యం చెప్పారు. కాగా, సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి మృతి వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులకు తీవ్ర నష్టమని పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అన్నారు. సీపీఐ పార్టీ జిల్లా కార్యాలయంలో శక్రవారం కామ్రేడ్ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం నాయకులు ఎల్.సుందరరావు, పాలికి లక్కు, సోమెలి చిట్టిబాబు, వి.కృష్ణ, ఎస్.భవానీ జయంతి, సరితా భాయ్, బాలరాజు, పెద్దబాబు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీలపై తర్జనభర్జన

... 5వ పేజీ తరువాయి

శివారు ప్రాంతంలో పనిచేసి ప్రస్తుతం నగరంలో పనిచేస్తున్న మరో తహసీల్దారు అనకాపల్లికి వెళ్లడానికి నిర్ణయించారు. అనకాపల్లి జిల్లా నుంచి ఇద్దరు మహిళా తహసీల్దార్లు నగరానికి రావడానికి అక్కడ అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. కాగా విశాఖ జిల్లాలో పనిచేస్తున్న కొందరు తహసీల్దార్లపై ఉన్నతాధికారులు అసంతృప్తితో ఉన్నందున కనీసం ఇద్దరు లేదా ముగ్గురిని అనకాపల్లికి పంపాలని లేదా అప్రాధాన్య పోస్టుల్లో నియమించాలని భావిస్తున్నారు. మరో తహసీల్దార్ అయితే ప్రస్తుతం పనిచేస్తున్న మండలం నుంచి తప్పించాలని కోరుతున్నారు. కలెక్టరేట్‌లో పనిచేయడానికి సిద్ధపడినట్టు చెబుతున్నారు. మరో తహసీల్దారు విషయంలో కూటమికి చెందిన కీలక నేత ఒకరు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, సదరు అధికారిని ఏజెన్సీకి పంపాలని ఉన్నతాధికారులకు స్పష్టంచేశారని జోరుగా ప్రచారం జరుగుతుంది. కాగా బదిలీలకు ఈనెల 22 వరకు గడువు పొడిగించడంతో వచ్చే వారం ఉమ్మడి జిల్లా పరిధిలో ముగ్గురు కలెక్టర్లు భేటీ కానున్నారని, ఈ భేటీలో తహసీల్దార్ల బదిలీలపై ఒక నిర్ణయం తీసుకుంటారని తెలిసింది.

నిర్లక్ష్యాన్ని ఉపేక్షించను

... 5వ పేజీ తరువాయి

జాకరవలస మీదుగా సొంటరిపాడు వరకు ఉన్న ఆరు కిలోమీటర్ల రోడ్డు నిర్మించాలని పలువురు కోరగా, చింతపల్లి మండలం బలపం పంచాయతీ జోహరు గ్రామస్థులు కె.రామారావు, వి.నాగరాజు తదితరులు, కోరుకొండ నుంచి తారురోడ్డు నిర్మించాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి బి.పద్మావతి, టీడబ్ల్యూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్.శర్మ, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి జమాల్‌బాషా, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు డీవీఆర్ఎం.రాజు, కె.వేణుగోపాల్, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ కొండలరావు, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి


రక్షిత తాగు నీరు అందించేందుకు ఆర్వో ప్లాంట్ నిర్మాణం జరగనున్నది.

తీరనున్న విద్యార్థుల అవస్థలు

ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషి ఫలితంగా విద్యార్థుల అవస్థలు తీరనున్నాయి. ప్రధానంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న వసతి సమస్య తీరనున్నది. నూతన నిర్మాణాలతో సైన్స్ ల్యాబ్‌లు అందుబాటులోకి వస్తాయి. ప్రాక్టికల్స్‌కు అంతరాయం ఉండదు. కళాశాలలో విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో రాణించేందుకు అవసరమైన శిక్షణ ఇస్తున్నారు. డిజిటల్ లైబ్రరీ అందుబాటులోకి వస్తుండడంతో విద్యార్థులు పోటీ పరీక్షలకు శిక్షణ పొందవచ్చు. డిగ్రీతోపాటు విద్యార్థులు వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ కళాశాలలోనే పొందే అవకాశం ఉంటుంది.

రెండేళ్లలో నిర్మాణాలు పూర్తి

-డాక్టర్ ఎం. విజయభారతి, ప్రిన్సిపాల్



కళాశాలలో పీఎం ఉషా పథకం ద్వారా రెండేళ్లలో నిర్మాణాలు పూర్తి కానున్నాయి. నిర్మాణ బాధ్యతలను ఏపీఈడబ్ల్యూఈడీసీ ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించారు. ఇంజనీరింగ్ అధికారులు డీపీఆర్‌లు ప్రభుత్వానికి సమర్పించారు. నిధులు విడుదల కావడంతో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నిర్దేశిత సమయానికి ముందుగానే భవనాలు, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు.

సంక్షిప్తంగా..

భూ ముల ఆక్రమణలపై అరకులో 25న భారీ ర్యాలీ

పాడేరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ప్రభుత్వ భూముల పరిరక్షణ చేపట్టాలనే డిమాండ్‌పై ఈనెల 25న అరకులోయలో నిరసన ర్యాలీ చేపడతామని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర శుక్రవారం తెలిపారు. పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న అరకులోయలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు అధికమయ్యాయన్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని ఆనుకునే సుమారు 40 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమిస్తే రెవెన్యూ అధికారులు కనీసం పట్టించుకోలేదన్నారు. అలాగే పాడేరుతో సహా అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఐటీడీఏ పీవో అభిషేక్‌కు ఫిర్యాదు చేశారు. .

విద్యుత్ ఉత్పాదన పునరుద్ధరణ

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 13: మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదన శుక్రవారం పునరుద్ధరించారు. భారీ వర్షాల కారణంగా ఇటీవల జల విద్యుత్ కేంద్రంలోకి వరదనీరు ప్రవేశించడంతో విద్యుత్ ఉత్పాదన నిలిచిపోయిన విషయం తెలిసిందే. ప్రాజెక్టు అధికారులు, కార్మికులు, అగ్నిమాపక సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనిచేయడంతో ఐదు రోజులు అనంతరం 1, 3వ నంబర్లు గల జనరేటర్లను వినియోగంలోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆ రెండు జనరేటర్ల సహాయతో 34 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన జరుగుతున్నది. మిగిలిన జనరేటర్లను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు తెలిపారు.

డుంబ్రిగుడ ఎస్‌ఐగా పాపినాయుడు



డుంబ్రిగుడ, సెప్టెంబరు 13: డుంబ్రిగుడ ఎస్‌ఐగా పాపినాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎలమంచిలిలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడ వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ సంతోష్‌కుమార్ అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు.

'పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం'


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు, సెప్టెంబరు 13: పోషకాహారం గర్భిణులు, బాలింతలు, మూడేళ్లలోపు పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి సోపానమని సీడీపీవో విజయకుమారి అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం డౌనూరు సెక్టారు మల్లవరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాల స్టాల్ ఏర్పాటు చేసి వాటి ప్రాముఖ్యతను సీడీపీవో వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కుమారి, సూపర్‌వైజర్లు సునీత, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దినోత్సవం

అరకులోయ, సెప్టెంబరు 13: అరకులోయ కో-ఎడ్యుకేషన్ కళాశాలలో శుక్రవారం హిందీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్‌నాయక్ మాట్లాడుతూ జాతీయ భాష హిందీని విద్యార్థులు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హిందీ అధ్యాపకురాలు సుందరీరాణి, వైస్ ప్రిన్సిపాల్ పుష్పరాజ్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఏ హిందీలో విద్వాన్ విద్యార్థులు

డుంబ్రిగుడ, సెప్టెంబరు 13: హిందీ ప్రచార సభ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ విద్వాన్ డిగ్రీ పరీక్షలో ఉత్తీర్ణులైన ఏఎస్ఆర్ జిల్లాకు చెందిన విద్యార్థులు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రెగ్యులర్ ఎంఏ హిందీ ప్రవేశాలు సాధించినట్టు ప్రచార సభ ఐటీడీఏ కన్వీనర్ శెట్టి సూరిబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పీజీ సెట్ ఎంట్రన్స్ రాసి ఉత్తీర్ణులైన స్థానిక హిందీ విద్వాన్ విద్యార్థులు శెట్టి రుకిరణ్మయి, భూలక్ష్మి, లక్ష్మణరావు, రమేష్‌తోపాటు పలువురు విద్యార్థులు ఎంఏ హిందీ ప్రవేశాలు సాధించినట్టు చెప్పారు. విద్యార్థులకు ఏయూ ఆర్ట్స్ విభాగం ప్రిన్సిపాల్ అభినందించినట్టు ఆయన తెలిపారు.

చత్రాపల్లి గిరిజనులను ఆదుకోవాలి

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 13: చత్రాపల్లి గిరిజనులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ కోరారు. శుక్రవారం చత్రాపల్లి గ్రామాన్ని సీపీఐ నాయకులు సందర్శించారు. జరిగిన సంఘటనపై స్థానిక గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. ధ్వంసమైన గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ కొండచరియలు విరిగి పడడం వల్ల ఆదివాసీలు గృహాలు, ఆస్తులు, పంటలు నష్టపోయారన్నారు. జీకేవీధి-సీలేరు రహదారిని సాధ్యమైనంత వేగంగా పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లాకార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, నాయకులు కంకిపాటి సత్తిబాబు, ఇంగువ రామరావు, సతీశ్, వంతల రామారావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను కట్టడి చేయాలి

చింతపల్లి, సెప్టెంబరు 13: గిరిజన ప్రాంతంలో బాల్య వివాహాలను కట్టడి చేయాలని మండల స్థాయి చైల్డ్ మ్యారేజ్ కమిటీ చైర్మన్, ఎంపీడీవో పి. ఆశాజ్యోతి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి చైల్డ్ మ్యారేజ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నియంత్రించేందుకు గ్రామ స్థాయిలో సచివాలయం మహిళా కానిస్టేబుళ్లు, అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, సచివాలయ ఉద్యోగులు పనిచేయాలన్నారు. ఎక్కడైన బాల్య వివాహాలకు జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తుంటే ముందుగా ఐసీడీఎస్ అధికారులు, మహిళా కానిస్టేబుళ్లకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీవో రామలక్ష్మి, ఎస్ఐ అరుణ్ కిరణ్, ఎంఈవో-1,2 పనసల ప్రసాద్, గెమ్మెలి బోడం నాయుడు, డీటీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నప్రసాదం పంపిణీ

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 13: స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద అల్లూరి యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి పురస్కరించుకొని శుక్రవారం ఏర్పాటు చేసిన అన్న ప్రసాదం పంపిణీకి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి సహకరించిన అందరికీ కమిటీ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. అల్లూరి యూత్ సభ్యులు ఉదయ్‌కుమార్, సురేష్, ప్రసన్నకుమార్, శ్రీను, మురళి, సాయికిరణ్, రవి, శ్యామ్, గణపతిరాజు, చంటి, మహేష్ పాల్గొన్నారు.